# 20

# గొలుసు

**(కథా కాలం 1985)**

“ఏం రమణా యింతాలస్యం చేసినవ్? నేను యింకో అయిదు నిమిషాలు చూసి వెళ్ళిపోదామనుకున్న.” అన్నాడు విజయ్.

“సారీ విజయన్నా! కొంచెం లేటయింది.” సంజాయిషీ ఇచ్చాడు రమణ.

“సరే గాని బయల్దేరుదాం పద.” అంటూ బయల్దేర తీశాడు ఆర్గనైజర్ విజయ్.

❄ ❄ ❄

“రమణా! సైకిల్ ఎత్తేస్తున్నది. బొందలు చూసుకుంట పోనీ... పోస్టర్లు పాడవుతయి. అన్నట్టు మొన్న రవిని కలిసినవట గదా?” ఆరా తీశాడు ఆర్గనైజర్ విజయ్. మళ్లీ తనే సముదాయిస్తూ అన్నాడు.

“రమణా! ఇది రహస్య విద్యార్థి యూనిట్ నిర్మాణం కదా! ఇతరులను కలవకు. టైం పాస్ కాలేదని అటూ ఇటూ తిరగకు. పనిలేని రోజు పుస్తకాలు చదువు. మన రహస్య నిర్మాణ పద్ధతుల్ని ఒంటబట్టించుకోవాలె. రవి యూనిట్ వేరు. నీ యూనిట్ వేరు. నీ ఏరియాయే వేరు. అసలు నువ్వా క్యాంపస్ ఛాయలకే పోవద్దు. ఇంకోసారి నువ్వు, రవి కలుసుకోవద్దు. వింటున్నవా?” అన్నాడు విజయ్.

“ఊఁ...” అంటూ ఊ కొట్టాడు రమణ.

“ఈ మధ్య నీ గురించి తిరుగుతున్నరట. ఎలా లీకైందో తెలియదు. కొంచెం చూసుకుంట తిరుగు. అనవసరంగా ఎక్కడా బయట తిరగకు. మొన్న ఇచ్చిన బుక్స్ చదివినవా?” మళ్లీ అన్నాడు అన్న విజయ్.

“చదివిన” అంటూ నసిగాడు రమణ.

“మీ ‘బాబాయి’ ఆరోగ్యం మంచిగయిందా? మందులు వాడుతున్నరా?”

"అం కొంచెం. మందులు అవే."

❄ ❄ ❄

"రమణా ఉన్నవా? బాగా ఆలోచిస్తున్నవేంది? రూంలో ఎంత సేపట్నించి వెయిట్ చేస్తున్నవ్?"

"చాలా సేపట్నించి." అన్నాడు రమణ.

"మొన్న నువ్వు రాస్తనన్న కవిత రాసినవా?"

"రాసిన. పంపించిన." అన్నాడు రమణ.

"రాసుడైంది. పంపించుడు కూడా అయిందా? ఇంకో కాపీ వుంటే ఇవ్వు. ఎట్ల రాసినవో చూస్త." అంటూ విజయ్ చెయ్యి చాపాడు.

"ఇదిగో. చూడు" అంటూ కార్బన్ కాపీ ఇచ్చాడు రమణ.

"కవిత మంచిగుంది. చాలా బాగ వచ్చింది." మెచ్చుకున్నాడు విజయ్.

"సరేగాని, అన్నా! మూడు నెలల కిందట మనోల్లను అరెస్టు చేసిన్రు కదా. వాళ్ళ విషయం ఏమైనా తెల్సిందా? ఇంకా కోర్టుకయితే ప్రొడ్యూస్ చేయలేదు. చేస్తే పేపర్లో వచ్చేదిగదా. అసలు వాల్లని ఉంచిన్రా?" అడిగాడు రమణ.

"రమణా! అదే మనకు స్పష్టంగా తెలుస్తలేదు. హెబియస్ కార్పస్ వేసినా ఫలితం లేకపోయింది." విజయ్ మొహం ఆందోళనతో ముడుచుకుపోయింది. వారి గురించిన ఏవేవో జ్ఞాపకాలు కదలాడాయి.

"వాళ్లను విడుదల చేయాలని రాత్రి మూడోసారి మేము బస్సులకు పోస్టర్లు వేసినం. అయితే అన్నా! ఖమ్మంలో మల్లా ముగ్గురు అరెస్టయిండ్రట నిజమేనా?" అడిగాడు రమణ.

"ఔను. నిజమే. మనవాళ్ళే." అన్నాడు విజయ్.

"ఈ రోజు పేపర్ చూసినవా?" అడిగాడు రమణ.

"అం చూసిన. వరంగల్లో, గోదావరిఖనిలో కూడా చాలా అరెస్టులు జరిగినయట. ఈ పేపర్లల్లో ఏ జిల్లాది ఆ జిల్లాకు రావడం వల్ల మనకు ఏ వార్తా సరిగ్గా తెలుస్త లేదు. ఇలా అరెస్టు చేసిన మిలిటెంట్లని ఎక్కడయినా

ఎవడయినా పోలీసు చావగానే ఆ మిలిటెంట్లని హత్య చేసి ఎన్‌కౌంటర్ అని ప్రకటనలిస్తున్నరట!" అంటూ నిర్బంధాలను క్లుప్తంగా వివరించాడు విజయ్. ఎక్కువ వివరాలు చెపితే రమణ భయపడతాడేమోనని సంకోచించాడు.

"ఉత్తర తెలంగాణలో నిర్బంధం చాలా వున్నట్టుంది." అన్నాడు రమణ.

"ఔను. ఉత్తర తెలంగాణ అనే ఏముంది? మొత్తం తెలంగాణ అంతటా ఇట్లనే ఉన్నది. ఇక్కడ మాత్రం తక్కువ నిర్బంధం ఉందా? నువ్వో నేనో దొరికితే విడిచిపెడతరా? ఎన్‌కౌంటర్ అంటరు." నవ్వే ప్రయత్నం చేశాడు విజయ్.

"అక్కడ మన స్టూడెంట్స్ యూనియన్స్ నడుస్తయంటవా?"

"ఎందుకు నడవయి? తప్పకుండా నడుస్తుంటయి. ఎంతో పకడ్బందీగా రహస్యంగా నడుస్తుంటయి" కొన్ని వివరాలు, జాగ్రత్తలు చెప్తూ మళ్లీ అన్నాడు విజయ్.

"అన్నట్టు రమణా! మావో రచనలు చదివినవా? తొందరగా చదివి యివ్వాలె. నేను కూడా మళ్లా చదవాలె."

"మొన్ననే చదివినంటివి గదా!"

"అవుననుకో! అయితే మన పుస్తకాలు సర్క్యులేటింగ్ లైబ్రరీ పుస్తకం కదా. తలాపుకు పెట్టుకు నిద్రపోతే ఎలా?"

"ఊ!... నువ్వు ఎంత పనైనా చెప్పు చేస్తగనీ... ఎందుకో చదువుడంటే వెంటనే నిద్రొస్తంది. అయినా వెంటనే చదివి యిస్తా." రమణ ఆవలింతలు తీశాడు.

"రేపు నేను అరెస్టయితే మన స్టూడెంట్స్‌ని ఆర్గనైజ్ చేయాల్సింది నువ్వే. చదవకపోతే ఏం చెప్తవు? ఎట్ల ఆర్గనైజ్ చేస్తవ్?" నవ్వుతూనే ముందు జాగ్రత్తలు చెప్పాడు విజయ్.

"నేను చదవడం కోసం నువ్వెందుకు అరెస్టు కావాలె అన్నా? మార్చు తోడు వారం రోజులల్ల తప్పకుండా చదువుత."

"అది సరేగానీ నేను అరెస్టవకపోతే మాత్రం? నువ్వు ఒక కొత్త యూనిట్‌ను స్టూడెంట్స్‌ను జమ చేసి ఎందుకు ఆర్గనైజ్ చేయకూడదు? సైన్సు స్టూడెంటువు.

నీకు 'అమీబా' గురించి తెల్సుగదా. మన రహస్య పని పద్ధతుల్లో అచ్చంగా ఏకకణ జీవి అయిన అమీబాలా విస్తరించాలె. అమీబా ఒకటి రెండుగా విడిపోతుంది. రెండు నాలుగవుతాయి. మన యూనిట్లు కూడా అంతే. అమీబాతీరే ఎన్ని రూపాల్లోనయినా ఏర్పాటు చేయవచ్చు." అంటూ సూచించాడు విజయ్.

సరే అంటూ ఎలా ఆర్గనైజ్ చేస్తున్నాడో ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు రమణ.

"రమణా! నువ్వీ ఏడాదిలో ఎంత ఎదిగిపోయినవో చూస్తే ఆశ్చర్యం వేస్తున్నది. నువ్వు నా కన్నా ఏమైనా తక్కువ పని చేస్తున్నవా? అయితే అవగాహన పెరగటానికి పుస్తకాలు చదువు అంటున్న." మళ్లీ గుర్తు చేశాడు విజయ్.

"తప్పక చదువుత అన్నా. చూడు నువ్వే చూస్తవుగా." హామీ ఇచ్చాడు రమణ.

❄ ❄ ❄

ఎవరో దగ్గరకు రావడంతో అనుమానంగా చూసింది భారతి. కాసేపు ఆలోచనలో పడింది. మళ్లీ కళ్లు చిట్లించి చూసింది.

"నువ్వా రమణన్నా. నేను ఎవరో అనుకున్నా" అంటూ నవ్వింది భారతి.

"ఇంకా నయం పోలీసోడనుకుని ఉరకలేదు." అంటూ నవ్వాడు రమణ.

"ఉరకక ఏం చేస్త? నిజంగానే తప్పించుకునే దాన్ని. ఎందుకంటే నువ్వు పొద్దున్న వస్తనని రాకపోతివి. నువ్వే అని ఎట్ల అనుకుంట?" అంది భారతి.

"సారీ భారతీ! ఉదయం మీ దగ్గరకి వస్తుంటే ఎవడో ఫాలో అయిండు. వాన్ని ముప్పుతిప్పలు పెట్టి తప్పించుకున్న." అని కుశలమడిగి అన్నాడు రమణ.

"అవునుగాని భారతీ! అనుపమ నిరంజన రాసిన 'మాధవి' నవల చదివినవా?"

"అన్నా! నిజంగా 'మాధవి' నవల ఎంత బావుందన్నా... రెండుసార్ల చదివిన. మహాభారతంలో యయాతి గురించిన కథను ఎంత గొప్ప నవలగా రాసింది. గాలవ్య మహర్షి మాధవిని ఒక్కొక్కరి దగ్గర కొంతకాలం కిరాయికివ్వడం, ఆమె బాధలు ఎంత ఘోరంగా ఉన్నయి? ఆనాడు ఆడోళ్లను మనుషులలెక్క చూసిన్రా? హరిశ్చంద్రుడు భార్యను అమ్మేసిండు. పాండవులు ద్రౌపదికి ఐదుగురు భర్తలన్నరు. ఎక్కడా స్త్రీలకు స్వేచ్ఛ లేదు. 'మాధవి' నవల గురించే చర్చలు చేస్తున్నం. ఇంకా

ఫ్రెండ్సు చదువుతున్నరు. పుస్తకానికి అర్జంటేమీ లేదుగదా!"

"సరే! చైనా నవల 'కొడుకులూ-కూతుళ్ళూ' చదివినవా?" మళ్లీ అడిగాడు రమణ.

"చదివిన అన్నా! అబ్బ ఎంత బాగుందో!... నవలలో లీనమై చదువుతున్న. టాషాయ్ మాటుగాసి చూస్తున్నడు. నువ్వచ్చి పిలిచినవు.. అందుకే కంగారుపడ్డ."

"అంతేగనీ ఉదయం వస్తనన్న రమణన్న ఇంకా రాలేదేందని కంగారేమీ లేదన్నమాట!"

"భలే ఉన్నవు అన్నా! ఎంత కంగారుపడ్డనో చెప్తే తప్ప నమ్మవా ఏంది? ఇదిగో యిదేంది? - కలర్. ఇదిగో యిదేంది - పేపర్. ఈ రాత్రిదాకా చూసి రేపు రాత్రి నీ గురించి పోస్టర్లు వేద్దామని అన్నీ రెడీ చేసుకున్నం. ఐతే ఈ రోజు తొలుత ఎంత భయమేసిందో నీకు తెల్వది"

"ఎందుకు?" అంటూ ఏం చెపుతుందోనని ఆసక్తిగా చూశాడు రమణ.

"ఎందుకేందన్నా? నాకు మన యూనిట్లో మనలో ఇద్దరు తప్ప ఎవరూ తెల్వది. ఈ యిద్దర్లో నువ్వు రాకనేపోతివి. ఇక మేం యిద్దరం కలిసి నీ ఆచూకీ కోసం ఎక్కడికని తిరగడం. పోస్టర్లు ఎలా వేయడం అని తెగ బాధపడ్డం."

"అయితే మరేం చేసినవ్?"

"ఏం చేస్త? చచ్చినట్టు మొహమాటాలూ, సిగ్గూ వదిలేసి స్వరాజ్యాన్ని, స్వరూపని నా వెంట పోస్టర్లు వేయటానికి వస్తరా లేదా? మన స్నేహబంధం మాట యిది అని అడిగిన. భయపడుకుంట బెరుకు బెరుకుగనే ఒప్పుకున్నరు."

"వాళ్లకు మేరీ టైలర్ రాసిన 'భారతదేశంలో నా జైలు జీవితం', ఎగ్నెస్ స్మెడ్లీ రాసిన 'భూమి పుత్రిక' యివ్వనుంటివి." అన్నాడు రమణ.

"మేరీ టైలర్ పుస్తకం చదువుతున్నరు." అంది భారతి.

"ఔనూ భారతీ మరోమాట! 'స్త్రీ స్వేచ్ఛ-నూతన ప్రజాస్వామిక విప్లవం' అనే అంశం మీద మీ ఫ్రెండ్సుతో కల్సి ఒకపూట చర్చా గోష్ఠి పెట్టుకుంటే ఎలా వుంటుందంటవ్? అంతా గరల్స్ అండ్ లేడీసే. చర్చను నువ్వే ప్రారంభించాలె. నువ్వే సమ్మప్ చేయాలె." అని నవ్వుకుంటనే కార్యక్రమం ఇచ్చాడు రమణ.

"అమ్మో నేనా! నాకు భయం. నువ్వు రా! నువ్వొస్తే కనీసం ఏడుగురినయినా పట్టుకొచ్చే పూచీ నాది."

"అలా ఎలా కుదురుతుంది? ఆ ఏడుగురు ఇక నుండి నీ యూనిట్ అనుకో. అది నీ యూనిట్ అయినపుడు. రహస్య పని పద్ధతుల ప్రకారం నీ యూనిట్లోకి నేనెట్ల వస్త? వాళ్ళకు నేనెట్ల పరిచయం అవుత? నువ్వే ఎట్లనో నడిపించెయ్యి. వాళ్ళను ఎడ్యుకేట్ చేస్తూ పోవాలె. అందుకు చర్చలు, పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతయి." అన్నాడు రమణ.

"అన్నా! వాళ్ళతో నెగ్గుకరావడం చచ్చే చావవుతున్నది." అంది భారతి.

"ఎలా ఏంది? వాళ్ళకు దేనిమీద ఇంట్రెస్టుందో దాన్నుంచే మొదలు పెట్టు."

"అదెలా సాధ్యం? సుజాతకు ఈ మధ్య ఒలింపిక్ పిచ్చి పట్టుకుంది."

"ఒలింపిక్ పిచ్చయితే ఓ పని చెయ్యి. ఒలింపిక్ క్రీడల్లో సెకన్ల వాచీలో సెకన్లో నూరోభాగాన్ని సైతం కౌంట్ చేస్తరు. కాలం ఎంత విలువైందో... ఈ ప్రపంచాన్ని గురించి తెలుసుకోకపోతే మనం ఎన్ని వేల లక్షల సెకన్ల కాలాన్ని వ్యర్థంగా గడిపేస్తున్నమో... ఓ చిన్న క్లాసు తీసుకో..."

"కరక్టు రమణన్నా! బాగా చెప్పినవు. ఈసారి అదే పని చేస్త."

"భారతీ! వాళ్ళు విలేజి క్యాంపెయిన్ చేయడానికి, మన క్లాసులకు అటెండ్ కావడానికి కృషి చెయ్యాలె." మరో కార్యక్రమం ఇచ్చాడు రమణ.

"ష్యూర్." అంది ఉత్సాహంగా భారతి.

❄ ❄ ❄

"భారతీ! లేలే. రాత్రి పది కాలేదు నిద్రనా? విజయన్న అరెస్టయిండు"

"ఆఁ! ఇప్పుడేం చేయడం రమణా?"

"నువ్వు నీ యూనిట్ కల్సి పోస్టర్లు రాసి నీ లిమిటెడ్ ఏరియాలో అతికించాలె."

"ఆ తర్వాత?"

"ఉన్నాయిగా బస్సులు. ఆ తర్వాత రెండు రోజులు చూసి.. మరో వైపు పేపర్ స్టేట్మెంటు ఇయ్యాలె. కోర్టులో వెంటనే ప్రొడ్యూస్ చేయకపోతే యింకా

యిలాంటివే... అన్నట్టు నా రూంలోని సామాను రేపు పొద్దున్నే ఖాళీ చేసి నీ రూంలో పడెయ్యి. నా రూం విజయన్నకు తెలుసు. కనుక వెంటనే ఖాళీ చెయ్యాలె."

"ఇప్పుడు నీకు మల్లా రూం ఎక్కడ దొరుకుతుంది?"

"ఇక నాకు రూమెందుగ్గానీ... తొందరగా పో. మీ ఫ్రెండ్సుని కలువు. ఈ రాత్రే నా రూంకు పోయి సామానంతా సర్దిపెట్టి, అర్ధరాత్రి మళ్ళీ వచ్చి పోస్టర్లు వేయటానికి వాళ్ళతో పోవాలె...." అన్నాడు రమణ.

"అంటే రమణా! యికనుంచి విజయన్న బాధ్యతలన్నీ నీకేనా....?" అడిగింది భారతి.

"ఔను. భారతీ! చర్చకు యిపుడు టైం లేదు. చాలా పనులున్నయి. తొందరగా పో." అన్నాడు రమణ.

అలాగే అంటూ భారతి బయటకు నడిచింది.

**- 'అమీబా' పేరుతో అరుణతార మాసపత్రిక, 1988**